# రాగవిపంచి

అమెరికా అబ్బాయికి అమ్మాయిని సెలెక్ట్ చేయడమంటే బ్రాండ్‌నేమ్ చూసి పెర్‌ఫ్యూమ్ సెలెక్ట్ చేసుకున్నట్లు కాదు.

హైదరాబాద్‌లో దాదాపు పది సంబంధాలు చూశాను వైభవ్‌కి. అందులో ఒక్క సంబంధమే వచ్చింది. ఐ.ఎ.ఎస్. ఆఫీసరు కూతురు కల్పన బాగా నచ్చింది. కొత్త స్కోడా కారులా మెరిసిపోతూ వుంటుంది. ఇంగ్లీషులో మాట్లాడుతూ వుంటే కళ్లు అప్పగించి ఆ పిల్లవంకే చూస్తూ వుండిపోయాను.

ఒక్కతే కూతురు.... బోలెడంత ఆస్తి వుంది. బి.టెక్ దాకా చదివింది.

వైభవ్ అమెరికాలోని డెట్రాయిట్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. కల్పన కూడా బి.టెక్ చదివింది కాబట్టి అమెరికాలో ఇద్దరూ కలిసి డాలర్లు పండించవచ్చు. ఐ.ఎ.ఎస్ ఆఫీసరు తనకు వియ్యంకుడైతే తన పరపతి పెరుగుతుంది.

వైభవ్ తన జీవిత భాగస్వామిని సెలెక్ట్‌చేసే బాధ్యతను అమ్మా నాన్నలకే వదిలేశాడు. కాబట్టి జాగ్రత్తగా తామే వాడికి ఈడుజోడుగా వుండే పిల్లను చూడాలని తాపత్రయపడ్డారు.

మొత్తంమీద మంచి సంబంధమే దొరికింది.

ఇంటిముందు కారు ఆగిన శబ్దం వినిపించింది.

కల్పనే కారుడ్రైవ్ చేసుకువచ్చింది.

మా ఆవిడకు అదో అలవాటు... దగ్గరవాళ్ళు బాగా తెలిసినవాళ్లు వస్తే వాళ్ళ చేతులు పట్టుకుని వెంటనే వదలదు. చెయ్యి నిమురుతూనే వుంటుంది. ఆప్యాయతను, అనురాగాన్ని ఆమె అలా ఎక్స్‌ప్రెస్ చేస్తూ వుంటుంది. కల్పనకు అది నచ్చలేదు. కొంచెం దూరంగా జరిగి, "అంకుల్... వైభవ్ ఫోన్ నెంబరు కావాలి. అతనితో మాట్లాడాలి" అంది.

కాబోయే భర్తతో ఫోన్‌లో మాట్లాడాలని ఉబలాటపడటంలో తప్పేమీలేదుగా! కానీ మావాడితోనే చిక్కు కొంచెం రిజర్వ్‌గా వుంటాడు. పరిచయం లేకుండా డైరెక్ట్‌గా ఆ అమ్మాయి మాట్లాడితే రెస్పాన్స్ ఇస్తాడో... లేదో! వాడిని అడగకుండా ఫోన్ నెంబరు ఇస్తే ఏమనుకుంటాడో?

"మా వాడి ఫోన్ నెంబరు మారిందమ్మా! రెండు మూడురోజుల్లో కొత్త నెంబరు నీకు ఇస్తాను" అన్నాను ఆ అమ్మాయితో.

మా ఫ్యామిలీ ఆల్బమ్ తెచ్చి కల్పనకు చూపించింది మా ఆవిడ. వైభవ్ ఫోటోలు తదేకంగా చూస్తూ వుండిపోయింది. మా అమ్మాయికి నచ్చినట్లు ఆ అమ్మాయి మొహంలో తొంగి చూస్తున్న ముసిముసి నవ్వులు స్పష్టంచేస్తున్నాయి.

కూల్‌డ్రింక్ తెచ్చి ఇచ్చింది ఇందిర. "మనోహర్‌గారితో మాట్లాడి సంబంధం ఖాయం చేసుకోలేకపోయారా?" అంది ఇందిర కల్పన వెళ్ళాక.

"కల్పన మన ఇంటికోడలని ఎప్పుడో అనుకున్నాను. మా వూరు వెళ్ళి శివరామయ్యను తీసుకువస్తాను... మేమిద్దరం వెళ్లి మనోహర్‌గారితో మాట్లాడి సంబంధం ఖాయం చేసుకుంటాం.... అబ్బాయి వచ్చేక నగలు, బట్టలు కొందాం. మ్యారేజ్ హాల్ కూడా బుక్ చేసుకోవాలి."

"నేను మీ పక్కన లేకపోయినా ఫరవాలేదుగాని, మీ స్నేహితుడు పక్కన లేకపోతే ఏ పనీ తలపెట్టరుగా" అంది ఇందిర నవ్వుతూ.

❖ ❖ ❖

అవును... శివరామయ్య నా రెండో ప్రాణం. ఆప్తమిత్రుడు. సంతోషాన్ని అయినా, దుఃఖాన్ని ఐనా అతనితోనే పంచుకునేది. ఇద్దరిదీ ఒకే వయస్సు అయినా తనకు పెద్దదిక్కు అతనే! చిన్నప్పుడు తండ్రి శవంచూసి తను గాభరాపడితే భుజంమీద చెయ్యివేసి ఓదార్చాడు.

క్యాన్సర్‌తో అమ్మ చనిపోతే కుంగిపోయిన మనస్సును కుదుటపర్చింది. చికాకుల వలలో తను చిక్కుకుపోతే సానుభూతి చూపేది, నవ్వుతూ మాట్లాడుతూ ఓదార్పు నిచ్చేది అతనే!

చిన్నప్పుడు ఇద్దరం కలిసి తోటల్లో, పొలంగట్ల మీద తిరుగుతూ ఆడుకునేవాళ్ళం. మా వూరి మట్టిని ఒంటినిండా పూసుకునేవాళ్ళం.

ఆకాశంలో హరివిల్లు విరిస్తే అది మాకోసమేనని సంబరపడే వాళ్ళం.

కోడిగుడ్డు దీపం ముందు చదవకుండా కునికిపాట్లు పడుతూ వుంటే చన్నీళ్ళతో మొహం కడిగి పద్యాలు అప్పజెప్పిచ్చుకునేవాడు.

అతని అరిచేతిలో బొంగరం తిప్పినా, స్కూల్లో అన్ని సబ్జెక్టుల్లో ఫస్ట్ మార్కులొచ్చినా అతనితోపాటు నేనూ ఎంతో సంబరపడేవాడిని.

ఓసారి కుక్క కరిచి బెంబేలుపడితే, గాయం మీద కాకర ఆకురసం పిండి,రాగి కానీ వుంచి కట్టుగట్టాడు శివరామయ్య. ఆ రాగి చిల్లు కాని భద్రంగా దాచుకున్నాడు తను. ఇప్పటికీ మా ఇంటి ఐరన్‌సేఫ్‌లో ఆ రాగికానీ భద్రంగా వుంది.

బొప్పాయి ఆకులు వుండే కాడలను కత్తులుగాచేసుకుని వాడు పురుషోత్తముడిగా, తను అలెగ్జాండరుగా కత్తియుద్ధంచేసేవాళ్ళం.

నా చేతిలోని బొప్పాయికాడ విరిగిపోవడంతో నిస్సహాయంగా నిలబడిపోయేవాణ్ణి...

"అలెగ్జాండర్ ఓడిపోకూడదు" అంటూ వాడి చేతిలోని బొప్పాయి కాడ నాకు ఇచ్చి, విరిగిన కాడ తను తీసుకునేవాడు. పదినిముషాలు గడిచాక ఓడిపోయినట్లు నటించేవాడు.

కొబ్బరిపుల్లలు, కాగితంతో గాలిపటం తయారుచేసుకోవడం.... మైదాపిండి దొరకనప్పుడు, అన్నం మెతుకులతో గాలిపటానికి తోక అంటించేవాళ్ళం. పొలాల మధ్య దిబ్బలమీద చేరి గాలిపటాలు ఎగరెయ్యడం... మధ్యమధ్యలో పండిన సీమ చింతకాయలు కోసుకుని తినడం, తెగిన గాలిపటం కోసం పొలాలకు అడ్డంగా పరుగెత్తడం, చెరువులో ఈతకొట్టడం, కాళ్ళుచేతులు ఆడిస్తూ నీళ్ళమీద తేలిపోతూంటే, ఆనందలోకంలో విహారమే!

పట్టణ యాంత్రిక జీవనాన్ని నేను ఆహ్వానిస్తే, వాడు మాత్రం మా వూరి మట్టికి అంటుకుపోయాడు.

నిడుబ్రోలు స్టేషన్లో రైలు ఆగింది.

ఫ్లాట్‌ఫారమ్ మీద శివరామయ్య కన్పించగానే ప్రయాణబడలికపోయి గుండెల్లో ఆత్మీయతానురాగాలు అలల్లా కదిలేయి.

"ఏరా! బాగున్నావా?" అంటూ ఆప్యాయంగా భుజంమీద చెయ్యివేశాడు.

వాడు కన్పించనంతవరకూ 'నేనే గ్రేట్' అనుకుంటూ వుంటాను. గ్రేటర్ హైదరాబాద్‌లో పెద్దభవంతిలో వుంటున్నాను. సచివాలయంలో జాయింట్ సెక్రటరీగా పెద్ద

పదవిలో వున్నాను- అనే గర్వం నా గుండెల్లో ఎప్పుడూ గూడుకట్టుకుని వుంటుంది... శివరామయ్య మారుమూల పల్లెటూరులో చిన్నరైతు. ఐదెకరాల మాగాణిలో రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడితే, వాడికి సంవత్సరానికి వచ్చే ఆదాయం మహా అయితే యాభైవేలు... అదీ ప్రకృతి అనుకూలిస్తే! నా రెండు నెలల జీతం అంతకంటే ఎక్కువే.

అదేం చిత్రమో! వాడు పక్కన నిలబడితే తలదించుకుంటాను స్వచ్ఛమైన సెలయేటి ప్రవాహం వాడు- రంగునీళ్ళ ప్రవాహం తను-

“రిక్షా ఎక్కి వెళ్దాం!” అన్నాను శివరామయ్యతో.

“వద్దులే, నడిచివెళ్దాం! రైలుకట్ట దిగి డొంకదారిలో వెళ్ళామంటే గంటలో మన వూరు చేరుకుంటాం” నా చేతిలోని బ్యాగ్ తీసుకుని వడివడిగా ముందుకు నడిచాడు శివరామయ్య.

వాడిని అనుసరించక తప్పలేదు.

“నువ్వు కూడా హైదరాబాద్ వచ్చెయ్యరాదూ! నాలుగు డబ్బులొచ్చే ఏదోక వ్యాపారం చూస్తాను నీకు” అన్నాను శివరామయ్యతో.

పెద్దగా నవ్వాడు.

“ఇక్కడ నాకేం లోటురా... ప్రశాంతంగా జీవితం గడిచిపోతుంటే! పల్లెటూళ్ళలో కొన్ని ఇబ్బందులు వుండొచ్చు.... సుఖంగా జీవిద్దామని అందరూ పట్టణాలకు ఎగబడితే, తిండిగింజలు పండించేది ఎవ్వరు? పల్లెల్లోని వాళ్ళంతా పట్టణాలకు వలసపోవడంతోనే పట్టణాలు మురికికూపాల్లా తయారవుతున్నాయి. పల్లెల్లో వున్న ప్రశాంతత, అందాలు పట్టణాల్లో ఎక్కడున్నాయిరా?”

అతను చెప్పేది నిజమేననిపించింది.

ధీమాగా నడుస్తున్న మిత్రుడిని చూస్తుంటే నవ్వొచ్చింది. తలపైన మెరిసే నీలాకాశం వాడి సొంతమైనట్లు, చెట్లమీద చేరి కిలకిలా రావాలు చేస్తున్న పక్షులు వాడివే అయినట్లు, డొంక దిగువలో వున్న పంటకాలువ, దుమ్మురేపుకుంటూ ఊరివైపు ఉరకలువేస్తున్న పశువుల మంద, పడమటి దిక్కున వాలిపోతూ అందమైన రంగులు వెదజల్లుతున్న భానుడు వాడి సొంతం అయినట్లు కూనిరాగం తీస్తూ నడుస్తున్నాడు శివరామయ్య. ఊరి దరిదాపులకు రాగానే జేబులు తడుముకున్నాను.

"ఏమిట్రా! పర్సు పోయిందా!" శివరామయ్య అడిగాడు కొంచెం ఆందోళనగా.

"సెల్‌ఫోన్ మర్చిపోయాను"

"మంచి పనే జరిగిందిలే! సెల్‌ఫోన్ దగ్గరుంటే హైదరాబాద్ నుంచి ఎవరోకరు అస్తమానం ఫోన్‌చేస్తూనే వుంటారు... భౌతికంగా నువ్విక్కడేవున్నా నీ మనస్సు అక్కడ వుంటుంది...

బంధువులతో, మిత్రులతో ఆప్యాయంగా నాలుగు మాటలు ఎదురెదురుగా కూర్చుని మాట్లాడుకోవడానికి ఈ టీవీలు, సెల్‌ఫోన్‌లు ఆటంకాలుగా తయారయ్యాయి.

వెనుక పండగొచ్చిందంటే ఇంటిల్లిపాదీ ఒకచోట చేరి ముచ్చట్లు చెప్పుకునేవారు. నవ్వులు కేరింతలతో ఇల్లు సందడిగా వుండేది.

ఇప్పుడేమో అందరి చూపులు టీవీకి అతుక్కొ పోయి వుంటాయి. టీవీలో వాళ్లు సగం ఇంగ్లీషులో, సగం తెలుగులో పండుగ గురించి చెబుతుంటే ఆముదం తాగిన ముఖాలేసుకుని కూర్చుంటున్నాం... మాట పలుకులేకుండా!" అన్నాడు శివరామయ్య తేలిగ్గా నవ్వేస్తూ.

ఊళ్ళోకి రాగానే తెలిసినవాళ్లు పలకరించారు.

"ఏం అల్లుడూ బాగున్నావా? బొత్తిగా నల్లపూసవైపోయావ్.... అసలు ఇటుకేసి రావడంలేదు. పొలం, ఇల్లు అమ్ముకున్నావ్.... అవన్నా వుంటే అప్పుడప్పుడూ వచ్చీ వెళ్తుండేవాడివి."

రంగయ్య మావ పలకరించాడు.

ఏడేళ్లు అయ్యింది స్వగ్రామం వచ్చి. ఊరుమారిపోయి వుంటుందనుకున్నాడు. పిల్లలు అమెరికా వెళ్ళి బాగా స్థిరపడటంతో వాళ్ళు పంపిన డబ్బుతో ఆధునికంగా కట్టుకున్న నాలుగు ఇళ్లు తప్పితే ఊరి స్వరూపంలో మార్పులేదు. మొండిగోడలతో 'ఇందిరమ్మ' ఇళ్లు కన్పించేయి.

'ఇంటింటా సౌభాగ్యం' అంటూ సర్కారీ గోడ మీద రాతలు దర్శనమిచ్చాయి.

శివరామయ్య ఇల్లు చూడముచ్చటగా వుంటుంది. పెద్ద పెంకుటిల్లు, ఇంటిముందు విశాలమైన ఆవరణలో పూలమొక్కలు, ప్రహరీగోడ మీద దట్టంగా అల్లుకున్న రాధామనోహరం, వీధిగుమ్మానికి ఆనుకుని అరుగులు–ఈశాన్యం దిక్కున పశువుల సావిడి,

ఆ పక్కనే పండిన ధాన్యం నిలువచేసుకున్న పురి, ఇంటివెనుకవైపు మామిడి, దానిమ్మ చెట్లు, బావిదగ్గర కొబ్బరిచెట్లు.

'ఆఫీసు పనితో అలసిపోయిన మనస్సు సేద దీర్చుకోవడానికి అనువైన ప్రదేశం' అనుకుంటూ నాలో నేనే మురిసిపోయాను.

వరండాలో పదిమంది ఆడపిల్లలను ముందు కూర్చోబెట్టుకుని సంగీతం నేర్పుతోంది శివరామయ్య కూతురు సంధ్యావళి.

రంగనాథుని ఉయ్యాలసేవ పాట నేర్పుతోంది.

నీలాంబరి రాగంలో చిన్నప్పుడు తనను ఒళ్ళో పడుకోబెట్టుకుని అమ్మ పాడేది. ఆ పాట ఇప్పటికీ తనకి గుర్తే... అచ్చం అదే గొంతుతో నీలాంబరి రాగమాధురి వింటుంటే కళ్ళు చెమర్చాయి.

నన్ను చూడగానే లేచి నిలబడి నమస్కరించింది సంధ్యావళి. చామంతిపువ్వులా పచ్చగా మెరిసిపోతూ వుంది. శరత్కాలపు వెన్నెలలా కంటికి ఆహ్లాదంగా కన్పించింది. వరండాలోనే కూర్చుని పిల్లలు పాడిన పాటలు విన్నాను.

"నీ బ్యాంక్ బ్యాలెన్స్ తగ్గిపోతుందేమోగాని పల్లెల్లో పచ్చదనం, ఆకాశంలో పక్షులు తరిగిపోవు" అన్నాడు శివరామయ్య ఇంటిముందు జొన్న గింజలు ఏరుకు తింటున్న పావురాళ్ళను చూస్తూ.

శివరామయ్య భార్య బసపమ్మ కాఫీ ఇచ్చింది. కమ్మటి కాఫీ వాసన ముక్కుల్లో దూరింది.

కాఫీ తాగిన తరువాత పెరట్లో బావి దగ్గర చేరాము. నడుముకు టవల్ చుట్టుకుని ఇద్దరం స్నానం ప్రారంభించాం. చల్లటి నీళ్లు ఒంటిమీద పడేసరికి ప్రాణానికి హాయనిపించింది.

నేనెందుకు వచ్చిందీ శివరామయ్యకు చెప్పాను. కల్పన అందచందాల గురించి, చదువు గురించి, మనోహర్‌గారి హోదా గురించి గొప్పగా చెప్పాను... అదే క్షణంలో ఎందుకనో నేను చెబుతున్నది వాస్తవం కాదేమోననిపించింది.

కల్పన ఇంగ్లీషులో గలగలా మాట్లాడుతుంది. ఆ అమ్మాయికి తెలుగు సరిగ్గా రాదు. పట్టుమని పదివాక్యాలు తెలుగులో మాట్లాడలేదు. రేపు అమెరికా వెళ్ళాక వైభవ్, కల్పన

ఇంగ్లీషులోనే మాట్లాడతారు... వాళ్ళకు పుట్టబోయే పిల్లలకు తెలుగురాదు... తెలుగువారి సాంప్రదాయం, సంస్కృతి గురించి వాళ్ళకు చెప్పే అవకాశంలేదు.

ఓ ముగ్గు వేయడంరాదు. ఓ పాట పాడలేదు.... పిల్లలకు కనీసం "ఏనుగు ఏనుగు నల్లన.... ఏనుగు కొమ్ములు తెల్లన... ఏనుగుమీద రాముడు... ఎంతో చక్కని దేవుడని" పాట నేర్పించే దిక్కేలేదు.

'తారంగం, తారంగం తాండవ కృష్ణా తారంగం' మరో పాట 'బావా బావా పన్నీరు' ఎవరు నేర్పుతారు? జీవన సౌందర్యాన్ని గురించి తనే ఓ విశ్వవిద్యాలయమై పిల్లలకు నేర్పే ఓ స్త్రీ మూర్తి తోడు పురుషుడికి వుండాలి. భగవంతుడు ఆనందంగా, ఆహ్లాదంగా జీవించడం ఎలాగో ఏ కొద్దిమంది చెవుల్లోనో గుసగుసలాడుతాడు...

స్నానంచేశాక హాల్లోకి వచ్చాను. అద్దాల బీరువాలో పుస్తకాల దొంతర కన్పించింది. నన్నయ, తిక్కన, పోతన, పాల్కురికి సోమనాథుడు, శ్రీనాథుడు, వేమన, కృష్ణశాస్త్రి, తిలక్, ఆర్.కె.నారాయణ్, సోమర్‌సెట్‌మామ్, టాల్‌స్టాయ్– వీళ్ళందరూ ఆ పుస్తకాల్లో కన్పించారు. పుస్తకాలు తిరగేస్తూ ఆ గదిలో చాలాసేపు గడిపాను.

"ఆ పుస్తకాలన్నీ మా అమ్మాయివి, బి.ఏ.వరకూ చదివింది. మా అమ్మాయికి కూడా పెళ్ళీడొచ్చింది. సంబంధం చూడాలి. నీకు తెలిసినవాళ్ళలో మన స్థాయిలో మంచి సంబంధం వుంటే కబురు చెయ్యరా!" అన్నాడు శివరామయ్య.

'కోలో కోలోయన్న కోలో నాసామి కొమ్మలకి వొచ్చింది ఈడు' సినిమా పాట గుర్తుకు వచ్చింది..... 'అవును ఈ తెలుగుకొమ్మకు ఈడు వచ్చింది... ఈ గుమ్మకి చూడాలి సరిజోడు' అనుకున్నాను.

❖ ❖ ❖

ఉదయం పదిగంటలవుతుంది. వీధి అరుగుల మీద కూర్చున్నాం. వేపచెట్టునీడ పడుతూ వుండటంతో అరుగులమీద చల్లగా వుంది.

"మన వూరు రావాలంటే నాకెందుకో బెరుకుగా వుంటుందిరా! ఇక్కడ మనుషులు, చెట్లు గర్వంగా తలెత్తి చూస్తున్నట్లు అన్పిస్తుంది... నాకేమో తప్పుచేసిన వాడిలా బెరుకుగా తలదించుకోవాల్సివస్తుంది. ఇక్కడకువచ్చాక పల్లెటూరిగాలి తగలగానే ఛాతీ ఉప్పొంగుతుంది... ఇక్కడే వుండి తలెత్తుకుని తిరగాలనిపిస్తుంది" అన్నాను.

శివరామయ్య నవ్వి ఊరుకున్నాడు. నేనెటూ ఈ వూళ్ళోనే స్థిరనివాసం ఏర్పాటు చేసుకోనని వాడి గట్టి నమ్మకం. సరిగ్గా అదే సమయంలో... ఎనభయ్యేళ్లు పైబడిన ఓ బిచ్చగాడు వచ్చాడు. ఆ వయస్సులో ఓపిగ్గా అన్ని ఇళ్ళూ తిరుగుతున్న అతన్ని చూస్తుంటే ఆశ్చర్యమేసింది.

"అమ్మా! అన్నపూర్ణమ్మ తల్లీ.... మాదాకవళం తల్లీ!" ఇంటిముందు నిలబడి కేకేశాడు. ఆ ఇంట్లోవాళ్లు అన్నం పెడతారని నమ్మకం వుందేమో కదలకుండా అక్కడే నిలబడిపోయాడు.

సంధ్యావళి పళ్ళెంలో అన్నం, పచ్చడి తెచ్చి బిచ్చగాడిచేతిలోని పాత్రలో వేసింది. బాగా ఆకలిమీద వున్నాడేమో నాలుగుముద్దలు తినేశాడు.

అదే సమయంలో పెద్ద గాలిదుమ్ము కెరటంలా వచ్చిపడింది. అతని పాత్ర నిండా దుమ్ముపడింది. కళ్ళలో పడ్డ దుమ్మును, ఎంగిలిచేతిని చొక్కాతో తుడుచుకున్నాడు. చేతిలోని కర్రబ్యాలెన్స్ తప్పడంతో కిందపడ్డాడు. మోకాలికి గాయం అయ్యింది. దోక్కుపోయి రక్తం కారుతూ వుంది.

అతను పడిపోవడం, మోకాలికి దెబ్బతగలడం చూసిలోపలికి పరుగెత్తింది సంధ్యావళి. ఈ చిన్న విషయానికే అంత కంగారుపడిందేమిటి ఈ అమ్మాయి? రెండు నిముషాలు ఆగితే ఆ ముసలాడే లేచి చక్కగా నడిచివెళ్తాడు. దీనిక్కూడ గాభరాపడిపోవాలా అనుకున్నాడు.

తడిగుడ్డ, డెటాల్ సీసాతో రెండు క్షణాల్లోనే తిరిగొచ్చింది సంధ్యావళి.

"అయ్యో.... తాతా! బాగా దెబ్బతగిలినట్లుంది" అంటూ అతని దగ్గరకు వెళ్ళి తడిగుడ్డతో గాయం తుడిచి డెటాల్ రాసి కట్టుగట్టింది.

"చల్లగా నూరేళ్ళు బతుకమ్మా నా బంగారు తల్లి" మనస్ఫూర్తిగా ఆ అమ్మాయి తల నిమురుతూ దీవించాడు ఆ ముసలాడు. ఆ అమ్మాయి దయాగుణం, కారుణ్యం నన్ను కదిల్చింది.

❖ ❖ ❖

ఆ రోజు రాత్రి తొమ్మిదిగంటలప్పుడు కరెంటుపోయింది. భోజనాలయ్యేక ఇంటి ముందు మంచాలు వేశాడు శివరామయ్య.

"కరెంటు పోవడం కూడా మనకు కలిసొచ్చిందిరా! హాయిగా ఆరుబయట ఆకాశంకేసి చూస్తూ నక్షత్రాలు లెక్కపెట్టుకోవచ్చు.

చిన్నప్పుడు లెక్కపెట్టేవాళ్ళం కదా! వెయ్యి నక్షత్రాలు అని నువ్వంటే, నీ లెక్క తప్పు అని వాదించే వాడిని' అన్నాడు శివరామయ్య దుప్పటి విదిలించి మంచంమీద వేస్తూ.

ఇంటిలోపలి నుంచి రాగయుక్తంగా పద్యం విన్పిస్తూ వుంది. అది పోతనగారి పద్యం.....

"ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు'

వాళ్ళమ్మకు విన్పిస్తూ వుంది సంధ్యావళి.

రాగవిపంచి ఆ అమ్మాయి... అనురాగవిపంచి...

తళుకుబెళుకుల తరుణే అందానికి నిర్వచనం అనుకునేవాడు తను... కానీ ఇంట్లో నడుం వచ్చి పనిచేసుకుంటూ చెంపలపై జారుతున్న చెమట చుక్కల్ని తడుచుకుంటూ ఆనందంగా పద్యమో, పాటో ఆలాపిస్తూ వుండే వనితలో శ్రమజీవనసౌందర్యం వెల్లివిరిస్తూ వుంటుంది.

ఈ సాంస్కృతిక వారసత్వం వున్న అమ్మాయినే అమెరికా పంపించాలి... నాలుగు తెలుగుపదాలు, పద్యాలు పిల్లలకు చెబుతుంది. అమెరికాలో కూడా తెలుగుభాష, సంస్కృతి బ్రతికిబట్ట కట్టగలుగుతుంది. ఓ నిర్ణయానికి వచ్చేశాను.

సంపెంగ పువ్వులాంటి సంధ్యావళి వైభవ్‌కు తగిన జీవితభాగస్వామి.... పెర్ఫ్యూమ్ లాంటి కల్పన కాదు.

కల్పనకు, వాళ్ళ నాన్నగారికి సర్దిచెప్పడానికి పెద్ద ఇబ్బందేమీ వుండదు. నా నిర్ణయం శివరామయ్యకు చెప్పేశాను. ఆ సంతోషంలో నన్ను వాటేసుకుని ఆప్యాయంగా నా చేతులు నిమిరాడు. ఎంతసేపైనా నా చేతులు వదలడంలా.

– 'స్వాతి' మాసపత్రిక, జనవరి **2008**